క్లుప్తంగా

పెనమలూరు బరిలో 11 మంది



పెనమలూరు: పెనమలూరు నియోజక వర్గ ఎన్నికల బరిలో 11 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నేడు జర గనున్న ఎన్నికల్లో ప్రధానంగా పోటీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్, టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్‌ల మధ్య ఉంది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి వెలిశల సుబ్రహ్మణ్యం, బీఎస్పీ సోము మహేశ్వర రవు, భారత చైతన్య యువజన పార్టీ గుర్రాల హరీషా, పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా చక్కా ఏడు కొండలు, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ మరీదు శశిధర్, జైభీం భారత్ పార్టీ సాదల ప్రసాదరావు, స్వతంత్ర అభ్యర్థులు పి.కనకదుర్గారావు, గోగం రాము, మారదాని విజయ ఎన్నికల బరిలో ఉన్నారు.

ముగిసిన గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఐదుదు రోజులుగా జరుగుతున్న గంగానమ్మ అమ్మవారు తిరునాళ్ల ఆదివారం శాంతి కల్యాణంతో ముగిసింది. ఉదయం శ్రీ అశ్వద్ధ నాగలింగేశ్వరస్వామి వారికి శాంతి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగానమ్మ ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం వైశాఖ శుద్ధపంచమి జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య స్వామి వారి జయంతి, శ్రీ రామానుజాచార్య స్వామివారి జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలతో తిరునాళ్ల ముగిసింది.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



మచిలీపట్నంటౌన్: పేద విద్యార్థులు విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని ఆది వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లారి శెట్టి శ్రీనివాసరావు అన్నారు. పదో తరగతి ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది వెలమ కుల విద్యార్థినీ విద్యార్థులు విద్యపైనే దష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు పిల్లారి శెట్టి సత్యనారాయణ, సూర్య కుమార్, ఉమామహేశ్వరి, ఈశ్వర్, ఆంజనేయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు నివాళి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మదర్స్ డే సందర్భంగా స్థానిక పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్డులోని మదర్‌థెరిస్సా విగ్రహానికి మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధనశేఖర్ ఆదివారం ఉదయం పూల మాల వేసి నివాళులర్పించారు. తోటి వారికి సహాయం చేయడం, అందరితో ప్రేమగా మాట్లాడటం వంటి గుణాలను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని ధనశేఖర్ అన్నారు.

పేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): క్లే లలితా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద నిరుపేద ప్రజలకు ఆదివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ డైరెక్టర్ క్లే సీతా మహాలక్ష్మి పాల్గొని ముందుగా క్లే లలిత విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షుడు క్లే నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆర్థిక సాయం, తోపుడు బండ్ల పంపిణీ, ఏసీ బాక్సులు, ప్రభుత్వ కార్యాలయాలకు కూలింగ్ వాటర్ మిషన్లు, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి.ధృవన్, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- నేటి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌ఓ రాజు



ఈవీఎంలను పరిశీలిస్తున్న ఆర్‌ఓ గీతాంజలిశర్మ

పెనమలూరు/కంకిపాడు: పెనమలూరు నియోజక వర్గంలో ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు పోలింలింగ్ సిబ్బంది వచ్చారు. అక్కడ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో పెనమలూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న 306 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సిబ్బందికి ఏ పోలింగ్ కేంద్రానికి ఎవరిని కేటాయించిందీ ప్రకటించి వారికి ఉత్తర్వులు అందజేశారు. ఆ తరువాత ఎన్నికల సిబ్బందికి స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరిచి ఉంచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. 24 మంది రూట్ అధికారులతో కలిసి ఎన్నికల సిబ్బంది వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో సాయంత్రం చేరుకున్నారు. పెనమలూరు మండలంలో 168 పోలింగ్ కేంద్రాలు, కంకిపాడులో 64 పోలింగ్ కేంద్రాలు, ఉయ్యూరులో 74 పోలింగ్ కేంద్రాలు చొప్పున ఉన్నాయి. పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది. పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి తిరిగి గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఉన్న కౌంటర్‌లో ఎన్నికల సిబ్బంది అప్పగించాల్సి ఉంటుంది. అక్కడ స్ట్రాంగ్ రూమ్‌లో సామగ్రి భద్ర పర్చుతారు. తరువాత ఎన్నికల సామగ్రి వివరాలు అన్నీ తనిఖీ చేసిన తరువాత ప్రత్యేక వాహనాల్లో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీకి తరలించి భద్రపరుస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి: ఆర్‌ఓ

ఎన్నికల ప్రక్రియ సక్రమంగా నిర్వహించేందుకు 306 పోలింగ్ కేంద్రాలకు 2,130 పోలింగ్ సిబ్బందిని విధుల్లో నియమించామని ఆర్‌ఓ డి.రాజు తెలిపారు. రిసెప్షన్ సెంటర్‌లో సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి భోజనం, ఇతర సదుపాయలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్దకు ఓట్లు వేయటానికి వచ్చే ఓటర్లకు సౌకర్యాలు కూడా కల్పించామని తెలిపారు. షామియానాలు, కుర్చీలు, తాగునీరు అందుబాటులో ఉంచామన్నారు. మాక్ పోలింగ్ సోమవారం ఉదయం 5 గంటల నుంచి ప్రక్రియ మొదలవుతుందని, 5.30 గంటల కల్లా ఏజెంట్లు మాక్ పోలింగ్‌కు రావాలని, వారు రాక పోయినా మాక్ పోలింగ్ వీడియో రికార్డింగ్ చేస్తామన్నారు. సాయంత్రం 6 గంటల లోపు పోలింగ్ కేంద్రాల్లోకి వచ్చిన వారికి ఓట్లు వేసే వరకు గడువు ఇస్తామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందో బస్తు వెబ్ కెమేరాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

గన్నవరం: నియోజకవర్గంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని ప్రత్యేక భద్రత మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించారు. తొలుత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ పర్యవేక్షణలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల విధులకు కేటాయించిన 2,154 మంది పీఓలు, ఏపీఓలు, ఇతర సిబ్బంది హాజరయ్యారు. వీరిని 34 రూట్లుగా విభజించి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఇతర పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం రూట్ల వారీగా కేటాయించిన వాహనాల్లో సామగ్రి, సిబ్బందిని నియోజకవర్గంలోని 306 పోలింగ్ కేంద్రాలకు తరలించారు. సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు చేపట్టారు. వేసవి కాలం దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, తాగు నీరు, మెడికల్ సదుపాయలను కల్పించారు. నియోజకవర్గంలోని 2,79,054 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 1,34,226, మహిళలు 1,44,816, ఇతరులు 12 మంది ఉన్నారు.

గన్నవరం నియోజకవర్గ ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
విజయవాడ రూరల్	43,271	45,603	4	88,878
గన్నవరం	35,524	38,853	5	74,382
బాపులపాడు	34,562	37,391	1	71,954
ఉంగుటూరు	20,869	22,969	2	43,840
	1,34,226	1,44,816	12	2,79,054

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు..

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికారులు పోలింగ్ కేంద్రాలు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భద్రత విధుల నిమిత్తం 1,200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని కేటాయించారు. శాంతి, భద్రతల పర్యవేక్షణకు ప్రత్యేకంగా 40 పోలీస్ మొబైల్ వాహనాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు.



గంగూరు ధనేకుల కాలేజీలో పోలింగ్ సిబ్బంది



పోలింగ్ సామగ్రితో బయలుదేరిన సిబ్బంది



కంకిపాడు ఎంపీపీ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు



గన్నవరం నుంచి బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



గన్నవరంలోని రాయ్‌నగర్ స్కూల్‌లో పోలింగ్ ఏర్పాట్లు

ప్రతి కుటుంబానికీ మంచి చేసే పాలన రావాలి



మాటలు చెప్పటం కాదు. చేతల్లో ఉండాలి. ఎవరి పాలనలో ప్రతి కుటుంబానికి మంచి జరిగింది అని ఆలోచించుకోవాలి. ఇచ్చిన మాట తప్పకుండా ఉండే సమర్థుడైన నాయకుడిని, వెన్నంటి నడిపించే నాయకుడిని ఎన్నుకోవాలి. అప్పుడే ప్రతి ఒక్కరికీ సంక్షేమ పాలన, అభివృద్ధి జరుగుతాయి. అలాంటి వారినే ఎన్నుకోవాలి.

–నాగూర్, కూరగాయల వ్యాపారి, కంకిపాడు

నిబద్ధత కావాలి



ఎన్నికలు రాగానే ప్రజల్లోకి వచ్చి ప్రేమ నటించే వ్యక్తులు, నాయకులు అవసరం లేదు. నిబద్ధతతో నడిచే నాయకుడుకి మద్దతు ఇవ్వాలి. అప్పుడే అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతుంది. మాయమాటలు, మోసాల వల్ల నష్టాలే ఎక్కువ. మంచి చేసే నిబద్ధత కలిగిన నేతను అధికారంలో కూర్చోపెట్టుకోవాలి. అలాంటి నాయకుడికే ఈ సారి నా ఓటు.

–కరీముల్లా, మెకానిక్, కంకిపాడు

కోవిడ్ కష్ట కాలంలో ఆదుకున్న వంశీ

గన్నవరం: 'ప్రజలు కష్ట కాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచి ఆదుకుని నేనున్నానంటూ భరోసా కల్పించే వాడే నిజమైన ప్రజా నాయకుడు'

'ప్రజల బాధలను పట్టించుకోకుండా ముఖం చాటేసి కేవలం ఎన్నికల సమయంలో కనిపించే వారిని స్వార్థపరులు అంటూరు'



పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్లను అందజేస్తున్న వంశీ ప్రతినిధులు (ఫైల్)

ఈ లిస్టులో మొదటి కోవకు చెందిన నాయకుడు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్. ముఖ్యంగా కోవిడ్ విపత్కర సమయంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు వ్యక్తిగతంగా ఆయన చేసిన సేవలు నియోజకవర్గ ప్రజలకు చిరకాలం గుర్తుంటాయి. ఆ కష్ట కాలంలో వంశీమోహన్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కోవిడ్ బారిన పడిన రోగులకు ఆస్పత్రుల్లో సత్వర వైద్య సేవలందించారు. అర్ధరాత్రి వేళ కూడా ఫోన్‌కాల్స్‌కు స్పందించి రోగులకు ఆస్పత్రుల్లో బెడ్‌లు కేటాయింపు నుంచి వైద్య సేవలందించే వరకు ఆయనే స్వయంగా పర్యవేక్షించిన ఉదాంతాలు ఎన్నో ఉన్నాయి. అత్యవసర వైద్య సేవల నిమిత్తం ప్రజలు సంప్రదించేందుకు తన కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కోట్లాది రూపాయిలు తన సొంత డబ్బును వెచ్చించి ఆక్సిజన్ సిలిండర్లను, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, మందులు అందజేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడారు. కోవిడ్ నుంచి కోలుకున్నప్పటికీ అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న రోగుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచారు. లాక్‌డౌన్‌లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకురాలేని పరిస్థితుల్లో పార్టీ శ్రేణుల ద్వారా ఇంటింటికీ కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేయించి కుటుంబ సభ్యుడిలా వంశీమోహన్ ఆదుకున్నారు.

ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా..

ముఖ్యంగా కోవిడ్ సేకండ్ వేవ్ సమయంలో దేశవ్యాప్తంగా ఆక్సిజన్ కొరత వల్ల వేలాది మంది ప్రజలు మృత్యువాతకు గురికావడం చూసి వంశీమోహన్ చేశారు. తన ప్రాంత ప్రజలకు ఈ పరిస్థితి ఉత్పన్నం కాకుడదనే ఉద్దేశంతో కోట్లాది రూపాయిలు ఖర్చుచేసి కోవిడ్ ఆస్పత్రులకు ఆక్సిజన్ సిలిండర్లను అందజేసేందుకు ఆయన స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. గన్నవరం సమీపంలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి వందకుపైగా, విజయవాడ జీజీహెచ్‌కు మరో 100, పోలీస్ శాఖకు 25 ఆక్సిజన్ సిలిండర్లను వంశీమోహన్ వితరణగా ఇచ్చారు. ఇంకా నియోజకవర్గంలో కోవిడ్ బారిన పడి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వందలాది మందికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను ఉచితంగా అందజేశారు. ఆక్సిజన్ దొరకడం కష్టంగా మారిన ఆ రోజుల్లో ప్రాణవాయువును అందించిన వంశీమోహన్ ప్రజల పాలిట ప్రాణదాతగా నిలిచారని అంటున్నారు. కోవిడ్ వైద్య సేవలు విషయంలో ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యేగా ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేశారని ప్రజలు చెప్పుకుంటున్నారు. కోవిడ్ సమయంలో ఆయన అందించిన సేవల గురించి ఇప్పటికీ నియోజకవర్గ ప్రజలు చర్చించుకోవడం గమనర్హం.

83 పోలింగ్ కేంద్రాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు బాపులపాడు మండలంలో పోలింగ్ కేంద్రాలు సిద్ధం అయ్యాయి. మండలంలో 83 పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే అధికారులు సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 71,954 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 34,562 మంది పురుషులు, 37,391 మంది స్త్రీలు ఉన్నారు. ఒక ట్రాన్స్‌జండర్ ఓటరు ఉన్నారు. బాపులపాడులో అత్యధికంగా 14 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కాగా మండంలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు దాదాపు వెయ్యి మంది సిబ్బంది చేరుకున్నారు. బాపులపాడులో 216వ నంబర్ పోలింగ్ బూత్‌ను మోడల్‌గా తీర్చిదిద్దారు. బెలూన్లు, తోరణాలతో ఆకర్షణీయంగా, పండుగ వాతవరణాన్ని తలపించే విధంగా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల కోసం ప్రత్యేకంగా తాగు నీరు, అత్యవసర వైద్య సేవల సదుపాయాలను ఏర్పాటు చేశారు.

ఉంగుటూరులో 43,840 మంది ఓటర్లు

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మండల వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీలకుగాను 55 పోలింగ్ బూత్‌లను అధికారులు సిద్ధం చేశారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 43,840 ఓటర్లకు గాను 20,869 మంది పురుషులు, 22,969 మంది స్త్రీలు, ట్రాన్స్ జండర్‌లు ముగ్గురు ఓటర్లు ఉన్నారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది



నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఈవీఎంలతో పోలింగ్ సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరుగనున్న నేపథ్యంలో నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లతో విచ్చేశారు. సెక్టార్ ఆఫీసర్ బి.రంగనాథ్ బాబు పోలీసు సెక్యూరిటీతో ఈవీఎం మిషన్లతో సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సెక్టార్ ఆఫీసర్ రంగనాథ్ బాబు మాట్లాడుతూ నున్న గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్, గ్రామ సచివాలయ కేంద్రాలు 2, 3, రైతుభరోసా కేంద్రం, కోటకట్ట సెంటర్ లోని పోలింగ్ కేంద్రాలతోపాటు మొత్తం 13 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. వాటికి గాను ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంటు పోలింగ్ ఆఫీసర్, నలుగురు ఓపీఎస్(ఇతర పోలింగ్ సిబ్బంది) విధులు నిర్వహిస్తారని తెలియచేశారు. పోలింగ్ సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రూట్ ఆఫీసర్ జీటీవీ రమణ, బీఎల్‌ఓలు విధులను నిర్వహణలో ఉన్నారు.

ఘనంగా శంకర జయంతి



ఆత్కూరులో శంకర జయంతి నిర్వహిస్తున్న భక్తులు



అలంకరణలో ఆది శంకరాచార్యులు

ఉంగుటూరు: మండలంలో ఆత్కూరులో శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో శంకర జయంతిని పురస్కరించుకుని ఆదివారం శివుని అభిషేకం చేశారు. ఆది గురువు శంకరాచార్యుల బోధనలు హిందూ ధర్మానికి నలు దిక్కుల దీపస్తంభాలుగా పనిచేశాయని కొనియాడారు. కొద్దిసేపు వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి, గోపరాజు సత్యపవన్, మామిళ్లపల్లి సుబ్బారావు, యామర్తి వకుళ, స్వర్ణ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామ లింగేశ్వర్వామివారి దేవస్థానంలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్యులు జయంతి ఘనంగా చేశారు. ఉదయం శ్రీఆదిశంకరచార్యుల వారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం వేద పండితులకు ఘనంగా సన్మానం చేశారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ రామలింగేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత వైభవంగా చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వి.సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి దాత, ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లు.. 4 వాటర్ ట్యాంక్‌లు

- రెండు వేల మీటర్ల పైప్‌లైన్ విస్తరణ పూర్తి
- టెండర్ దశలో మరో రెండు వాటర్ ట్యాంక్‌లు
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



ప్రారంభానికి సిద్ధంగా ఎనికేపాడు 24కే కల్యాణ మండపం వద్ద 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో ఎళ్ల తరపడి ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యలకు ప్రస్తుత ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం లభించింది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు తాగునీటి బోర్లమీదే ఆధారపడ్డ గ్రామస్తులకు ఇకపై రూ.3 కోట్ల వ్యయంతో నాలుగు నూతన వాటర్ ట్యాంకుల నుంచి తాగు నీరు అందనుంది. నగరానికి అతి సమీపంలో ఉన్న ఈ గ్రామంలో సుమారు 20 వేలకు పైగా జనాభా నివసిస్తున్న ప్రతి వేసవిలో తాగునీటి యుద్ధాలు తప్పడం లేదు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకూ గ్రామంలో కేవలం 17 మోటారు బోర్లతోనే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దశాబ్ధాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యలకు చెక్ పడింది.

ప్రారంభానికి సిద్ధంగా రెండు ట్యాంకులు..

గ్రామంలోని 24కే కల్యాణ మండపం సమీపంలో 1.20 లక్షల లీటర్లు, బీసీ శ్మశానవాటిక సమీపంలో 60 వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌లను రూ.98 లక్షలతో అభివృద్ధి చేశారు. వీటి నిర్మాణం పూర్తి చేసి రంగులు కూడా వేశారు. ఇవి కాక విజ్ఞాన్ విహార్ పాఠశాల సమీపంలోని కామన్ స్థలం 30 సెంట్లలో రూ.1.60 కోట్లతో 2.40 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్, జెండా చెట్టు సెంటర్ సమీపంలో రూ.30 లక్షల వ్యయంతో 40 వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం నిమిత్తం టెండర్ దశలో ఉన్నాయి. ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో వీటి నిర్మాణానికి కొంత అంతరాయం కలిగింది. ఎలక్షన్ కోడ్ పూర్తయిన తర్వాత వెంటనే టెండర్లను ఆహ్వానించి నిర్మాణ పనులు మొదలు పెట్టనున్నారు.

రెండు వేల మీటర్ల పైప్‌లైన్ల విస్తరణ..

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో రెండు వేల మీటర్ల మేర పైప్‌లైన్ విస్తరణ పనులను పూర్తి చేశారు. ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంకుతో పాటు కొత్తగా నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 1.20 లక్షల లీటర్లు, 60 వేల లీటర్ల ట్యాంకులకు పైప్‌లైన్‌ను అనుసంధానం చేశారు. మోటారు బోర్ల ద్వారానే ఇప్పటి వరకు గ్రామంలో తాగునీటి సరఫరా చేసిన పంచాయతీ అధికారులు, ఇక నుంచి నూతన వాటర్ ట్యాంకుల అను సంధానంతో పైప్‌లైన్ ద్వారా గ్రామం మొత్తం సురక్షిత తాగునీరు అందించనున్నారు. పూర్తయిన పైప్‌లైన్ విస్తరణ పనులను కూడా అతి త్వరలో ప్రారంభించనున్నారు.

ఎన్నికల కోడ్ పూర్తయిన వెంటనే ప్రారంభం



నూతనంగా నిర్మాణం పూర్తయిన 1.20 లక్షల లీటర్ల ట్యాంకు, 60 వేల లీటర్ల వాటర్ ట్యాంకులను ఎన్నికల కోడ్ పూర్తయిన వెంటనే ప్రారంభిస్తాం. ఇప్పటికే పైప్‌లైన్ విస్తరణ, అనుసంధానం పనులు కూడా పూర్తి చేశాం. మరో రెండు ట్యాంకుల నిర్మాణం నిమిత్తం అతి త్వరలో టెండర్లకు ఆహ్వానించనున్నాం. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకూ ఇబ్బందులు పడుతూనే మోటారు బోర్ల సహాయంతో గ్రామంలో తాగునీటిని అందించాం. ఇకపై ఈ సమస్యలకు స్వస్తి పలుకుతూ నాలుగు నూతన వాటర్ ట్యాంక్‌లతో తాగునీరు అందిస్తాం.

–రాచమళ్ల పూర్ణచంద్రరావు, సర్పంచి, ఎనికేపాడు

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ యోగా గురువు మల్లా సుధాకరరావు అన్నారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన 909వ శిక్షణ శిబిరం ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లా సుధాకరరావు మాట్లాడుతూ భారతీయ సనాతన సంప్రదాయాల్లో యోగ చాలా ప్రాచీనమైనదన్నారు. నిరంతరం యోగా సాధనతో అనేక దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేయవచ్చని తెలిపారు. యోగా జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతి రోజూ యోగా సాధన చేయటం ద్వారా కేవలం శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం సైతం లభిస్తుందని వివరించారు. యోగా శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ దానిని నిరంతరం సాధన చేయాలని సూచించారు. ప్రతి రోజు కొద్దిసేపు యోగాకు సమయాన్ని కేటాయించటం ద్వారా మంచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు.